అభివృద్ధి దిశగా పాలూరు రాజుపాళెం

- మారిన గ్రామ రూపురేఖలు
- నాడు–నేడుతో పాఠశాల అభివృద్ధి
- దళితవాడకు ప్రత్యేక సీసీ రోడ్డు
- కోట్లలో సంక్షేమ పథకాల అమలు



సైదాపురం: మండల కేంద్రానికి 7కిలోమీటర్ల దూరంలో ఉండే పాలూరు రాజుపాళెం గ్రామ పంచాయతీ గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు. కేవలం నీరు చెట్టు పథకం ద్వారా తెలుగు తమ్ముళ్లు చెరువు కట్ట అభివృద్ధి పనులు చేసి లక్షలు దోచుకున్నారు. ఈవిషయమై విజిలెన్స్ అధికారులు కూడా ఈచెరువు పనులపై ప్రత్యేక తనిఖీలు చేశారు. కనీసం సౌకర్యాలు నోచుకోక, దీర్ఘకాలిక సమస్యలతో ప్రజలు అష్టకష్టాలు పడేవారు. గత ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమం అందేది కాదు. అయితే 2019లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాలూరు రాజుపాళెంలో అభివృద్ధి పరుగులు తీసింది. దీంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వెలుస్తున్నాయి. నవరత్నాల పేరుతో వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వివక్షకు తావు లేకుండా గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమాన్ని అమలు చేస్తుండడంతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో ప్రస్తుత ప్రభుత్వ పార్టీ నేతలు పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వేములచేడు గ్రామ సచివాలయ పరిధిలోనే పాలూరు రాజుపాళెం గ్రామం ఉంది. ఈగ్రామ పంచాయతీలో రాజుపాళెం, నాయుడు పాళెం ఉంది. ఈగ్రామ పంచాయతీ పరిధిలోనే పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సిమెంట్ రోడ్లకు రూ.12 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు.ప్రధానంగా బడి, గుడి, సంక్షేమ పథకాలు,తాగునీరు మౌలిక వసతులను పూర్తి చేశారు. గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ కూడా నిర్మించారు. అలాగే ఆభవనం సమీపంలోనే ఆర్బీకేను కూడా నిర్మించారు. గ్రామానికి సమీపంలోనే గ్రామ సచివాలయం నిర్మించడం విశేషం. మనబడి నాడు–నేడులో భాగంగా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో తాగునీటి ఎద్దడి ఉండేది. అయితే ఇప్పుడు అలాంటి కష్టాలు లేకుండా గ్రామస్తులకు తాగునీరు అందుతోంది.

'పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలు' అన్న నానుడిని ప్రస్తుత ప్రభుత్వం ఈనాలుగేళ్లకాలంలో అక్షర సత్యం చేసింది. రోడ్లు అభివద్ధికి రాచమార్గాలు అని విశ్వసించిన ప్రభుత్వం వాటిని అభివృద్ధి చేస్తోంది. దశాబ్దాలుగా పాలకులు పట్టించుకోని పల్లెలకు రవాణా వ్యవస్థ మెరుగుపరుస్తోంది. ఈక్రమంలో భాగంగా ఆర్అండ్‌బీ రహదారి నుంచి పాలూరు దళితవాడ, కమ్మపాళెం వరకు బీటీ రోడ్లను అభివృద్ధి చేశారు. దీంతో ఆ రెండు కాలనీ వాసులకు రహదారి సమస్య తీరింది. భూ హక్కు పట్టాలు, జగనన్న కాలనీ, నివాస స్థలాలను పేదలకు అందజేశారు. దీంతో ప్రజలు ఎలాంటి సమస్య లేకుండా సంతోష జీవనాన్ని వారు సాగిస్తున్నారు.

పాలూరు రాజుపాళెం సంక్షేమ పథకాలు	
డీబీటీ ద్వారా లబ్ధిదారులు	: 4,350
జమ అయిన నగదు	: రూ.14,03,39,879
నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులు	: 953
నగదు రూపంలో	: రూ.5,51,31,280


హెల్త్ సెంటర్


సీసీ రోడ్డు

వీధి వీధిలో సిమెంట్ రోడ్లు:



గ్రామంలో సిమెంటు రోడ్లు వెలిసాయి. గతంలో వర్షం కురిస్తే అనేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి తిప్పలు తప్పాయి. ఈ ప్రభుత్వంలోనే గ్రామాభివృద్ధి జరిగింది.

కొండూరు చంద్రమ్మ రాజుపాళెం

ఈ ప్రభుత్వ మేలు మరువలేం:



మా పంచాయతీలో గతంలో ఎలాంటి ప్రభుత్వ భవనాలు లేవు. కేవలం పాఠశాల మాత్రమే ఉండేది. ఇప్పుడు మా గ్రామంలోనే ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, సచివాలయ భవనాలను కూడా నిర్మించారు. ఈ ప్రభుత్వ మేలు మరువలేం.

రాసిరాజు పార్వతి

ఆసరా అందుతోంది..



ఈ ప్రభుత్వంలో మాలాంటి నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతోంది. ఎవరి ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నాయి. గతంలో ప్రభుత్వ పథకాల కోసం నిరీక్షించాల్సి వస్తుండేది. ఇప్పుడు అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే వచ్చి తమ పేర్లను వలంటీర్లు నమోదు చేసుకుంటున్నారు. ఈ ప్రభుత్వం మళ్లీ రావాలి.

కొండూరు ఈశ్వరమ్మ

క్లుప్తంగా

భాస్కర్‌రెడ్డి మృతికి నేదురుమల్లి సంతాపం

దక్కిలి: దక్కిలికి చెందిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మాజీ ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ చెలికం భాస్కర్‌రెడ్డి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం తీవ్ర సంతాపం వ్యక్తం చేసినట్లు ఆయన కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. భాస్కర్‌రెడ్డి ఎన్నో ఏళ్లుగా నేదురుమల్లి కుటుంబానికి ఆత్మీయుడని పేర్కొన్నాయి. ఆయన కుటుంబసభ్యులకు భగవంతుడు మనోస్థైర్యం కల్పించాలని ఆకాంక్షిస్తూ తన ప్రగాఢ సానుభూతిని ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా భాస్కర్‌రెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. భాస్కర్‌రెడ్డి సుదీర్ఘకాలం పాటు రాజకీయంగా నేదురుమల్లి కుటుంబంతో నడిచారని, ఆయన మృతి రాజకీయ నాయకులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రకటనలో తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం


మాలయకోటలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ

నాయుడుపేటటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఏవరినీ ఉపేక్షించేది లేదని నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ వెల్లడించారు. గురువారం పట్టణంలోని మాలయకోట (మునిరత్నంనగర్)లో సీఐ సారథ్యంలో ఎస్‌ఐ గోపి, ఏఎస్‌ఐ ధర్మయ్య, సిబ్బంది ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని దుకాణాలను సైతం తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ కాలనీలో ఏవరైనా కొత్త వ్యక్తులు వచ్చి చేరినా, వారి కదలికలపై అనుమానాలు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికల లెక్కింపు తరువాత కూడా కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి లక్ష మల్లెలతో అభిషేకం


కల్యాణ వేంకటేశ్వరునికి మల్లెలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

నాయుడుపేటటౌన్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని బ్రాహ్మణవీధిలోని వ్యూహ లక్ష్మీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు లక్ష మల్లె పూలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణశర్మ సారథ్యంలో వేదపండితులు ఉదయం నుంచి స్వామి అమ్మ వార్లకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు.

కండలేరులో 6.698 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 6.698 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.50 వేల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని స్వర్ణముఖి నది తీరం వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు గురువారం బ్రాహ్మణ వీధిలోని షిరిడీ సాయిబాబా ఆలయ ధర్మకర్త కోటూరు సాయి రామ్‌ప్రసాద్, తులసి దంపతులు రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. సాయిబాబా ఆలయంలో గురువారం శ్మశాన వాటికకు సంబంధించిన హిందూ ధర్మసేవా సంఘానికి చెందిన మునగాల కృష్ణారావు, చిరువెళ్ల మునిరాజాలకు నగదును అందించారు. సాయిబాబా మందిర వ్యవస్థాపకులు కోటూరు వెంకట్రాయలు, కాంతమ్మల జ్ఞాపకార్థంగా సొంత నిధులు రూ.25 వేలు, సాయిబాబా ఆలయ నిధులు రూ.25 వేలను శ్మాశన వాటిక అభివృద్ధి పనులకు వితరణగా ఇచ్చినట్లు సాయిరామ్‌ప్రసాద్ తెలిపారు. ఆలయ పూజారి సుబ్బయ్యస్వామి పాల్గొన్నారు.

ఘనంగా మేరిగ పుట్టినరోజు వేడుకలు


మేరిగ పుట్టినరోజు సంబరాల్లో నేతలు

గూడూరురూరల్: ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ పుట్టిన రోజు వేడుకలను స్థానిక సనత్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నేతలు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని నేతలు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువతి మృతి

తిరుపతి రూరల్: ఆత్మహత్యకు పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ హరిపురం కాలనీలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.... సూళ్లూరుపేట మండలం వట్రపాలెంకు చెందిన మధుసూదనరావు కుమార్తె రోస్లిన్(23) రంగంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఫార్మా–డీ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. హరిపురం కాలనీలో అహ్మద్ అనే వ్యక్తితో కలిసి ఉంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఆర్థిక విషయాల్లో రోస్లిన్‌తో అహ్మద్ వాగ్వాదం చేశాడు. దీంతో కోపంతో బెడ్ రూంలోకి వెళ్లిన రోస్లిన్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారితో కలిసి తలుపులు పగలకొట్టిన అహ్మద్ కొన ఊపిరితో ఉన్న రోస్లిన్‌ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం రోస్లిన్ మృతిచెందింది. మృతురాలి తండ్రి మధుసూదనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు.

గరుడవాహనంపై కరిమాణిక్యస్వామి చిద్విలాసం


గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారిని పూలతో అలంకరించి గరుడ వాహనంలో ఆశీనులై గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గురువారం ఉదయం ఆలయం వద్ద స్వామి వార్లకు ద్వారదర్శనం ఏర్పాటు చేసి వేదపండితులు అధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు. టీటీడీచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తుమ్మూరులోని ఎస్‌కేబీఎస్ సత్రంలో గురువారం నుంచి దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి శశాంక్ ఆధ్వర్యంలో బ్రహ్మణ సమారాధన ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో చప్పర ఉత్సవం, రాత్రి స్వామివారు హంసవాహన సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి ఈసందర్భంగా తెలిపారు.

రైతు ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ


ఉచ్చూరులో మిచాంగ్‌తో దెబ్బతిన్న పంటను రైతులతో కలిసి పరిశీలిసున్న వ్యవసాయధికారులు(ఫైల్)

దొరవారిసత్రం: మండలం పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో వచ్చిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటకు నష్టపరిహారం కింద ఇన్‌పుట్ సబ్సిడీ నగదు రైతు ఖాతాల్లో గత మూడు రోజుల నుంచి జమవుతున్నాయి. తుపాన్ వలన 838 మంది రైతులకు చెందిన 396.86 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. హెక్టార్‌కు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.17వేలు చొప్పున రూ. 6,746,620 లక్షలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు స్థానిక ఏఓ జ్యోతిర్మయి తెలిపారు. పంట నష్టం జరిగి జాబితాల్లో పేర్లు ఉండి సబ్సిడీ నగదు ఖాతాల్లో జమ కాని రైతుల వివరాలు మళ్లీ సేకరించి పై అధికారులకు తెలియజేసి సబ్సిడీ వచ్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందన్నారు.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు

–ఏడీఏ నాగార్జునసాగర్


మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిరూరల్: పంటల సాగు ముందు రైతులు వ్యవసాయ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సాగుచేయాలని ఆ ద్వారా మంచి దిగుబడులు సాధించేందుకు దోహద పడుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తొలకరి వర్షాలు కురుస్తున్నాయని, ఈ మేరకు జీలుగ, జనుము, పిల్లిపెసరలను సాగుచేసి దున్నాలన్నారు. దీంతో భూమిలో భూసారం పెరుగుతుందని తెలియజేశారు. నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కలి మండలాల్లో ఆర్బీకేలకు ఇప్పటికే జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు చేరాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో సమీపంలోని ఆర్బీకేలో సంప్రదిస్తే 50శాతం రాయితీ విత్తనాలు పొందవచ్చునని తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


పెళ్లకూరులో పోలీస్ బలగాలు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం గ్రామంలో గురువారం స్థానిక సీఐ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో పెళ్లకూరు, నాయుడుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన పోలీసు బలగాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న తరుణంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలు ఇంటింటా విస్తృత తనిఖీలు చేశారు. గ్రామంలో అనుమానితులతో పాటు స్థానికేతరులను గుర్తించడం, సరైన రికార్డులు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలో రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించేవారిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్‌ఐలు శ్రీకాంత్, తిరుమలరావు, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

సంగవరం విద్యార్థినికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న నిర్మల

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని సంగవరం గ్రామానికి చెందిన నిర్మలకు అరుదైన గౌరవం దక్కింది. పీజీ కోర్సులో 85 శాతం మార్కులతో ప్రతిభ కనబరచడంతో నెల్లూరులోని సింహపూరి యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నిర్మల బంగారు పతకం అందుకున్నారు. ఆమెకు మండలంలోని పలువురు అభినందలు తెలిపారు.

వేడుకగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం


అలిమిలి గ్రామంలో గ్రామోత్సవం

బాలాయపల్లి (సైదాపురం): మండలంలోని అలిమిలి పంచాయతీ కనుమ రాయి కొండపై వెలసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవ స్థానంలో స్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతోత్సవంలో భాగంగా సింహ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జాతర విజయవంతానికి సహకరించాలి

–డీఎస్పీ శ్రీనివాసరెడ్డి


జాతర నిర్వహించే ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

నాయుడుపేటటౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కోరారు. జాతర నిర్వహణ కమిటీలతో కలిసి గురువారం రాత్రి జాతరకు సంబంధించి ప్రధాన ఘట్టాలను నిర్వహించే ప్రాంతాలను డీఎస్పీ సందర్శించారు. ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే జాతర నిర్వహణ తీరుపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతర ఘట్టంలో సమస్యాత్మక ప్రాంతాలు, పోలేరమ్మ విగ్రహం తయారీ మొదలుకొని నిమజ్జనం వరకు జరిగే జాతర తంతు, వివిధ వర్గాల వారు నిర్వహించే విధానాల విషయాలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు. అలాగే పోలేరమ్మ ఊరేగింపుగా వచ్చి ఆలయం వద్ద కొలువు తీరే విధానం, నగరోత్సవంలో నిమజ్జనానికి తరలి వెళ్లే వరకు నిర్వహించే జాతర ఘట్టాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విషయాలపై చర్చించారు. ఈ వేడుకలను సజావుగా జరిపేందుకు పోలీసులకు నిర్వాహకులతో పాటు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. అదేవిధంగా దేవదాయశాఖ అధికారులు ఆధ్వర్యంలో జరిగే జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా నాయుడుపేట డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ గోపి, దేవదాయశాఖ ఈఓ శశాక్, జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీ హోమం



అమ్మవారికి సారె తీసుకొస్తున్న ఉభయదారులు , ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని గురువారం చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులోభాగంగా అమ్మవారికి ఉదయం పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద నవ కలశాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం చండీ హోమం నిర్వహించే ఉభయకర్తలు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. హోమంలో పాల్గొన దలచిన భక్తులకు ఆలయ కార్యాలయంలో సంప్రదించి తగిన రుసుము చెల్లించి పాల్గొనవచ్చని నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ఉభయదారులుగా దొరువుకట్టకు చెందిన చిల్లకూరు రవీంద్రరెడ్డి, ఉమారాణి వ్యవహరించారు.

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


హాజరైన భక్తులు


కల్యాణోత్సవంలో భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకులు

- గజవాహనంపై స్వామి, అమ్మవారు

చిల్లకూరు: కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం ఉత్సవమూర్తులు స్వామి అమ్మవార్లను అలంకరించి ఆలయంలోని అనివెట్టి మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపైకి చేర్చారు. ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడిపోయింది. అనంతరం వేద పండితులు స్వామి, అమ్మవార్ల కల్యాణ ఘట్టాన్ని కనులకు కట్టినట్లు చూపిస్తూ అమ్మవార్లకు మంగళ సూత్రధారణ చేయించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పోసిన తలంబ్రాలను దక్కించుకునేందుకు యువతీ యువకులు పోటీ పడ్డారు. అనంతరం కల్యాణానికి హాజరైన 4 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఇందుకు ఉభయ కర్తలుగా చెన్నైకు చెందిన అనిశెట్టి సుబ్రహ్మణ్యం శెట్టి, అన్నాడి క్రిష్ణయ్యశెట్టి, అనిశెట్టి గురునాథం శెట్టి వ్యవహరించారు. భక్తులకు గూడూరుకు చెందిన సంతోష్ మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం గజవాహన సేవలో స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తరించారు. ఆలయంలో పూల అలంకరణకు ఉభయకర్తలుగా ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వరదిరెడ్డి రామోహన్‌రెడ్డి దంపతులు వ్యవహరించగా, గజవాహన సేవకు ఉభయకర్తలుగా తిప్పగుంటపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎల్లంటి ప్రభాకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు.